ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
గురువారం | 27 జూన్, 2024 | పేజీలు : 06


## రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే షాప్ లైసెన్స్ రద్దు..



**ప్రజాపక్షం / కోనరావుపేట :** నకిలీ విత్తనాలు రైతులకు అమ్మితే సంబంధిత ఫర్టిలైజర్ షాపు లైసెన్స్ రద్దు చేయబడుతుందని చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు అమ్మే విత్తనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించడం జరుగుతుందని రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మాలని సూచించారు. వారి వెంట ఏఈవో సహజ ఉన్నారు.

# మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. ఎంతో కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులకు మచ్చ తెచ్చే పనులు చేయవద్దని సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్, ఆల్కహాల్‌కు అలవాటు పడితే కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని పేర్కొన్నారు. యువత ఆల్కహాల్ తీసుకోవడం ప్రస్తుతం స్టేటస్ సింబల్‌గా మారిందని, భవిష్యత్తును మరిచిపోయి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు మిమ్మల్ని ప్రయోజకులను చేసేందుకు అహర్నిషలు కష్టపడుతున్నారని, వారి ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. డ్రగ్స్ ఆల్కహాల్ తీసుకోవడంతోనే అనేక సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. చదువుకు, క్రీడలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, తద్వారా లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. తమ స్థాయి ఏంటో సమాజానికి తెలిసేలా కష్టపడాలని పేర్కొన్నారు. డ్రగ్ పెద్ద మాఫియా అని, దీన్ని సమాజం నుంచి శాశ్వతంగా అందరం కలిసి నిర్మూలిద్దామన్నారు. మగవారిని చూసి బాలికలు, మహిళలు చెడు వ్యసనాల బారిన పడవద్దని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ శక్తివంతులుగా తయారు కావాలని పేర్కొన్నారు. జీవితంలో తల్లిదండ్రుల కంటే ఎక్కువగా ప్రేమ చెప్పేవారు ఎవరూ లేరని పేర్కొన్నారు. వారి ఆశయాలను నెరవేర్చడానికి నిరంతరం ప్రయత్నం చేయాలని సూచించారు. చదువుతో పోటీ పడి లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో ప్రతిభ చూపిన విధ్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరిండెంట్ పి.శ్రీనివాసరావు, కరీంనగర్ టౌన్ ఏసిపి నరేందర్, శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి, జిల్లా ఇంచార్జి సంక్షేమ అధికారి సబిత, సిడబ్ల్యూసి చైర్మన్ ధనలక్ష్మి, డీఈవో జనార్ధన్‌రావు, జిల్లా వైధ్యాధికారి సుజాత, తహసీల్దార్ కనకయ్య, సోషల్ వెల్ఫేర్ ఇంచార్జి డిడి హమీద్, నిషాముక్తి చైర్మన్ కేశవరెడ్డి, చైతన్యకళాశాల ప్రిన్సిపాళ్లు జి.వెంకటేశ్వర్లు, ప్రసాద్ రాజు, ఎ.రాం నరసింహారెడ్డి, విధ్యార్థులున్నారు.



## గంజాయి మత్తులో
# యువత బంధీ కావొద్దు




**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** మహమ్మారి గంజాయి మత్తుకు యువత బానిస కావద్దని, డ్రగ్స్ మాయలో పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని శ్రీరాంపూర్ సిఐ మోహన్, ఎస్ఐ సంతోష్ లు అన్నారు. బుధవారం మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏరియాలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాల గురించి ర్యాలీ నిర్వహించి అవగాహన సదస్సును కల్పించారు.

చెడు స్నేహాల ద్వారా ప్రలోభాలకు లోబడి ఒకసారి మాదకద్రవ్యాలు తీసుకున్న వ్యసనపరులు అయ్యే ప్రమాదం ఉందని అన్నారు. స్నేహితులు, దగ్గర వారు డ్రగ్స్ బారిన పడితే వారిని వాటికి దూరంగా ఉండేలాగా కృషి మత్తు పదార్థాలకు బానిసైన వారు వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు కారణమవుతారని, ఆత్మహత్య ఆలోచనలు కలిగి ఉంటారు, వ్యక్తులు తమను తాము గాయపరచుకోవడంతో పాటు ఇతరులపై దాడులు, హత్యలు, దొంగతనాల వంటి నేరాలకు పాల్పడే ప్రమాదకర మనస్తత్వం కలిగి ఉంటారని అన్నారు. మాదక ద్రవ్యాలను అరికట్టడంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ప్రధానంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన సూచనలు వింటూ విద్యార్థులు ఉన్నత స్థానంలో స్థిరపడాలన్నారు.

స్కూల్స్, కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ సేవిస్తున్నా, విక్రయిస్తున్నా ఆ సమాచారం తమకు అందిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలతో
# భవిష్యత్ అందకారం చేసుకోవద్దు

సీఐ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/మంథని:** యువత జీవితాలను నాశనం చేసే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మంథని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. అంతర్జాతీయ యాంటీ డ్రగ్స్ డేను పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో రామగుండం కమీషనర్ ఆదేశాల మేరకు విద్యార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సరదాగా మొదలైన మాదక ద్రవ్యాల అలవాటు వ్యసనంగా మారి వాటికి బానిసలుగా మారుతారని అన్నారు. యువకులు, విద్యార్డులు తమ తల్లిదండ్రుల కలలకు సాకారం చేకూర్చే విధంగా మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఎంతో మంది అమాయక యువకుల జీవితాలను నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్య క్షీణించిపోతుందని, మానసికంగా కృంగిపోతారని, ఆత్మహత్య చేసుకునే పరిస్థితులకు దారి తీస్తుందన్నారు. మత్తులో అసాంఘీక కార్యకలాపాలకు కూడా పాల్పడుతారని ఆయన వివరించారు. ఎవరు మత్తు పదార్థాలు సేవించినా తమకు సమాచారం అందించాలని, మత్తు పదార్థాలు అమ్మినా రవాణా చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని ఆయనహెచ్చరించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటకృష్ణతో పాటు ఆయా పాఠశాలల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పి.ఎఫ్, పెన్షన్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం

**ప్రజాపక్షం/రామగిరి :** రామగుండం3 & అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల సింగరేణి ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ సంబంధిత సమస్యల పరిష్కారం కొరకు బుధవారం జీ.ఎం. కార్యాలయం నందు ఆర్.జీ 3 ఏరియా జీ.ఎం. ఎన్.సుధాకరరావు అధ్యక్షతన నిర్వహించిన పి.ఎఫ్.పెన్షన్ అదాలత్' కార్యక్రమంలో భాగంగా విచ్చేసిన గోదావరిఖని రీజినల్ కమిషనర్ హరి పచూరి అదాలత్ కు హాజరైన విశ్రాంత ఉద్యోగులు వారు ఎదుర్కొంటున్నటువంటి పి.ఎఫ్, పెన్షన్ సంబంధిత సమస్యలను రీజినల్ కమీషనర్ దృష్టికి తీసుకురాగా వాటిని వీలయినంత తొందరగా పరిష్కారం చేస్తామని అన్నారు. అద్దె వాహన




యాజమానులు, డ్రైవర్లు వారికి సంబంధించిన నెల వారి పి.ఎఫ్, పెన్షన్ విషయాలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అదేవిధంగా వివిధ గనులు, విభాగాల సిబ్బంది ఈ మధ్యే ప్రవేశపెట్టిన సి.ఎం.పి.ఎఫ్. డిజిలైజేషన్ లో భాగంగా వివిధ క్లెయిముల పరిష్కారం కొరకు యూనిట్ స్థాయిలో చేసే డాక్యుమెంట్స్ అప్ లోడింగ్ లో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురాగా అవన్నీ ఫేజ్2 లో పరిష్కారం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ ఎ.జీ.ఎం. పి.శ్రీనివాసులు, పర్సనల్ మేనేజర్లు ముప్పిడి రవీందర్ రెడ్డి, కె.మారుతి, డి.వై.పి.ఎం గుర్రం శ్రీహరి, ఎఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ ఎం.రామచంద్ర రెడ్డి, ఐఎన్టియుసి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి, సంక్షేమ అధికారి సాయి కృష్ణ, సీఎంపిఎఫ్ సిబ్బంది కామేష్, భారతి, అనిత, వెంకట్ రెడి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బిఎంఎస్ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఎబికెఎంఎస్‌బిఎంఎస్) ఆధ్వర్యంలో ఈనెల 28న శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించే జనరల్ బాడీ సమావేశానికి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని యూనియన్ శ్రేణులను ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్ రెడ్డి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ స్థానిక నస్పూర్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించే జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎబికెఎంఎస్ ఇంటర్నల్ ఆడిటర్ రమాకాంత్, ఎస్‌సిఎంకెఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య, సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్ చాట్ల అశోక్ మొదలగు వారు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తలారి వినయ్, కుమార్, మిట్టపల్లి మొగిలి పాల్గొన్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి..



**ప్రజాపక్షం/మంథని:** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి రమాసురేష్‌రెడ్డి, కమీషనర్ గట్టు మల్లికార్జున స్వామి అన్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ కార్యాలయంలో వర్షాకాల సమస్యలపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. బారీ వర్షాలకు వరదలు వచ్చే వార్డుల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురిస్తే సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ముఖ్యంగా దోమలు వృద్ధిచెందకుండా పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, మురుగు నీటి నిల్వలులేకుండా చూడాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది సైతం ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు జాగ్రత్తలు చెప్పాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. వార్డు ప్రత్యేక అధికారులు ప్రజల సమస్యలు వారి అవసరాలు తెలుసుకుని పరిష్కారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాల ప్రవేశానికి మండల స్థాయి ఎంపిక

**ప్రజాపక్షం/ సుల్తానాబాద్ :** క్రీడా పాఠశాలలు (హకీంపేట కరీంనగర్ ఆదిలాబాద్) లో 202425 సంవత్సరానికి గాను నాలుగవ తరగతిలో ప్రవేశానికి బుధవారం సుల్తానాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపిక పోటీలు మండల విద్యాధికారి సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలలో మండలంలోని వివిధ పాఠశాలల నుండి 25 మంది విద్యార్థులు పాల్గొనగా ఐదుగురు విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక కాబడ్డారు. ఈ పోటీలలో ఎంపికైన విద్యార్థులు 29వ తేదీన పెద్దపల్లిలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దివాకర్, రత్నాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి క్రీడల ప్రాధాన్యతను విద్యార్థిని విద్యార్థులకు వివరించారు.ఈ



కార్యక్రమంలో నూతనంగా పదోన్నతి పై వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు సికె. శ్రీవాణి, ఆసియా బేగం, టి ప్రణయ్, జి .వెంకటేష్ లను సుల్తానాబాద్ మండల ఎస్ జి ఎఫ్ ,స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ డి .రమేష్ పీడీలు సంధ్య, శ్రీవాణి, ఆసియాబేగం, ప్రణయ్, వెంకటేష్,సిఆర్పి సదానందం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

## ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ లో సివిల్ పనులు పరిశీలించిన ఏజీఎం



**ప్రజాపక్షం/రామగిరి :** ఆర్జీ3,ఏపీఏ డివిజన్ లో సివిల్ పనులను బుధవారం రామగుండం ఏరియా సివిల్ ఏజీఎం పల్లెర్ల. నాగేశ్వర్ రావు పరిశీలించారు. ఈ డివిజన్‌లో జరుగుతున్న సివిల్ పనుల గురించి ఆడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆర్జీ3 డీజీఎం పి.వి.ఎన్.పద్మారాజ్, డీవై ఏస్.ఈలు పెద్దడ.రాజేంద్రప్రసాద్, రామకృష్ణా, ఈఈ సాయినాథు షిండే, ఏ ఈ బెల్లాల శ్రీనివాస్, విపీఆర్ కాంట్రాక్టర్ వి.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రెండేళ్లు గడిచినా పూర్తికాని పంచాయతీ భవనం

**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండలంలోని ముత్తారం గ్రామంలోని గ్రామపంచాయతీ భవనం రెండేళ్లు గడిచినా నిర్మాణం పనులు పూర్తికాలేదు. అద్దెభవనంలోనే గ్రామ పంచాయతీ కొనసాగుతోంది. గతంలో కొన్ని రోజులు ప్రభుత్వ పాఠశాలలో గ్రామ పంచాయతీని కొనసాగించారు. ఇటీవలనే నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ సమీపంలోనే అద్దె భవనంలో ఇరుకు గదిలో నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామ పంచాయతీకి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనాన్ని నిర్మించేందుకు ఆర్‌జిఎస్‌ఏ ద్వారా మంజూరైన రూ.20 లక్షల నిధులను మంజూరు చేసింది. 2022 మార్చి 19న అప్పటి మానకొండూర్‌ఎమ్మెల్యేబాలకిషన్ శంకుస్థాపన చేశారు.



**ఎమ్మెల్యే కవ్వంపల్లిపైనే ఆశలు**

గ్రామానికి ఆయువు పట్టయిన గ్రామ పంచాయతీ భవనం పూర్తి చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నిధులు మంజూరు చేస్తే గ్రామ పంచాయతీ పూర్తి పనులకు నోచుకోనుంది. స్పెషల్ డెవలప్‌మెంటు నిధులతో భవనం పూర్తి చేసి రంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## సిఎం ప్రత్యేక చొరవతో విద్యారంగం మరింత అభివృద్ధి



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో విద్యారంగం మరింత అభివృద్ధి చెందుతుంది అని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణా రావు అన్నారు. బుధవారం సుల్తానాబాద్ మండలం లోని కదంబాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు, గ్రామానికి చెందిన ఎన్నారై ముద్దసాని సుధీర్ రెడ్డి సమకూర్చిన స్కూల్ బ్యాగులను, నోట్ బుక్కులను విద్యార్థిని విద్యార్థులకుఎమ్మెల్యే విజయ రమణా రావు స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో పెద్దపల్లి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ గురుకుల విద్యాలయాన్ని నెలకొల్పనున్నట్టు చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగం అభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. మినుపాల ప్రకాష్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధన నాయక్ దామోదర్ రావు , కోడెం అజయ్, ముద్దసాని సురేష్ రెడ్డి, గోస్కుల సదయ్య లతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

## సిఎం పిఎఫ్ లెక్కలు సరి చేయాలని వినతి



**ప్రజాపక్షం / రామగిరి :** సీఎం పిఎఫ్ లెక్కలు సరిచేయాలని కోరుతూ రామగుండం ఆర్ జి త్రీ జిఎం ఆఫీస్ విచ్చేసిన సీఎం పిఎఫ్ రీజినల్ అసిస్టెంట్ కమిషనర్ హరి పచోరి కి సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న బుధవారం వినతి పత్రం అందజేశారు.సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల సీఎం పిఎఫ్ ఇయర్లీ లెక్కలు తప్పుల తడకలు ఉన్నాయని వాటిని సరిచేయాలని ఒక కార్మికునికి రెండు నెంబర్లు ఉండటం మూలంగా జమ చేయడం ఇబ్బంది ఉందని అలాగే కొంతమంది కార్మికుల ఇంటి పేరు వారి పేరు తప్పుగా నమోదైనది కాబట్టి వాటిని సరిచేయాలని ఇప్పటికే రెండు సంవత్సరాల లెక్కలు కార్మికులకు అందచేయలేదని వాటిని వెంటనే పూర్తి చేసి కార్మికులకు చిట్టీలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

## మంత్రి పొన్నంపై ఆరోపణలు చేసే స్థాయి కౌశిక్‌రెడ్డికి లేదు



కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆకారపు భాస్కర్‌రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్:** మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఆరోపణలు చేసే స్థాయి కౌశిక్ రెడ్డికి లేదని కరీంనగర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆకారపు భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మంత్రి పొన్నంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నాడని, ఆధారాలుంటే చూపాలని మంత్రి ఇప్పటికే తెలిపారని గుర్తు చేశారు. ఫ్లైయాష్ ఉచితంగానే రవాణా విషయమై ఇప్పటికే ఎన్టీపీసి సంస్థ ప్రతినిధులు వివరణ ఇచ్చారని, ఇందులో మంత్రి పొన్నం పాత్ర లేదని స్పష్టం చేశారని పేర్కొన్నారు. ఆనాటినుంచి ఈ నాటి వరకు ఎన్నో పదవులు నిర్వర్తించిన మంత్రి పొన్నం మచ్చలేని నాయకుడని, అలాంటి వ్యక్తి ఎదుగుదలను ఓర్వలేక కౌశిక్ రెడ్డి అనవసరపు ఆరోపణలు చేస్తున్నాడని పేర్కొన్నారు. అసలు కౌశిక్ రెడ్డి గెలుపుపై ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలో ఎన్నో సమస్యలున్నాయని, వాటిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. తాను రాజకీయంగా ఎదగడానికి మంత్రిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాడని, ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మూల రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వాసాల రవీందర్, మాజీ నగర మైనార్టీ అధ్యక్షుడు ఎంఏ కరీం, జిల్లా ఉపాధ్యక్షుడు బి.ఐలయ్య, కరీంనగర్ మండల కార్యదర్శి ఓజ్జాల శంకర్‌లు పాల్గొన్నారు.

## ఏరియా ఇంజినీర్‌గా పదవి బాధ్యతలు స్వీకరణ



**ప్రజాపక్షం / రామగిరి :** రామగుండం ఆర్జీ3 ఏరియా ఇంజినీర్ గా నియమితులైన వై.విజయ శేఖర బాబు బుధవారము ఆర్జీ 3 ఏరియా జి.ఎం ఎన్.సుధాకర రావుకు రిపోర్ట్ చేసి బాధ్యతలను స్వీకరించారు. వారు ఇంతకు ముందు ఇల్లందు ఏరియా లోని ఏరియా వర్క్ షాప్ విభాగ అధిపతి గా పని చేసి ఆర్.జీ 3 ఏరియా ఇంజినీర్ గా పదోన్నతి పొందారు.ఈ సందర్భంగా జి.ఎం. ఆర్.జి 3తో పాటు ఏరియాలోని వివిధ గనుల, విభాగాల అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్
ఫైజాన్ అహ్మద్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం నుండి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు నిర్వహించిన ర్యాలీని అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు, పోలీసులు, పట్టణ పుర ప్రముఖులు, విద్యాశాఖ,ఐసిడిఎస్,వివిధ శాఖలకు చెందిన అధికారులు,సిబ్బందితో నిర్వహించిన ఈ ర్యాలీ డ్రగ్స్ ను నిర్మూలిద్దాం యువతను కాపాడుదాం.. డ్రగ్స్ ను పక్కన పెట్టు జీవితాన్ని గాడిలో పెట్టు అనే నినాదాలతో సాగింది. అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టట్ మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడడం వలన శారీరక, మానసిక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. మాదకద్రవ్యాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. పాఠశాల,కళాశాలల స్థాయి నుంచి విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని అన్నారు.మత్తు పదార్థలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, మాదకద్రవ్యాల అమ్మకం, వినియోగం గురించి తెలిస్తే వెంతటనే పోలీసు అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని సూచించారు.అనంతరం మత్తు పదార్థాల నియంత్రణ కు సంబంధించి,అవగాహన పోస్టర్లను అధికారులు,యువతతో కలిసి అదనపు కలెక్టర్ ఆవిష్కరించి,మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అధికారులు,విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రత్న కళ్యాణి,డిడబ్ల్యుఓ నాగమణి,డీఈవో రవీందర్ రెడ్డి,డి.ఎం.హెచ్.ఓ ధనరాజ్, డి.పిఆర్.ఓ విష్ణువర్ధన్, రెవెన్యూ, తహసీల్దార్లు రాజు, సంతోష్, రెవెన్యూ, ఐసిడిఎస్, పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు, విద్యార్థులు, ఆశా కార్యకర్తలు, ప్రజలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నియంత్రణకు అందరూ సహకరించాలి




**ప్రజాపక్షం/జైపూర్ :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం జైనూర్ ఎసిపి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రజలందరూ ముఖ్యంగా చదువుకున్న యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఎవరైనా గంజాయి, జూదం వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అనంతరం జైపూర్ ఎస్ఐ శ్రీధర్ మాదక ద్రవ్యాల నిర్మూలన కొరకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సిఐ మోహన్, శ్రీధర్, నాగరాజు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సమస్యలను సత్వరమే పరిష్కరించండి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి:** కొడుకులు ఇబ్బందులు పెట్టే వయోవృద్దులు, తల్లిదండ్రులకు అధికారులకు అండగా ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. బుధవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ చట్టం కింద పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. కొడుకులు ఇబ్బందులు పెడుతున్నారని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. కొడుకులను పిలిపించి తగిన కౌన్సిలింగ్ ఇచ్చి సమస్యలు పరిష్కరించేలా చూడాలని పేర్కొన్నారు. తల్లిదండ్రుల నుంచి ఎక్కడ ఎలాంటి ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందించాలని అధికారులకు సూచించారు. విచారణ జరిపి వారికి తగిన న్యాయం జరిగేలా చూడాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్, హుజురాబాద్, ఆర్డీవోలు కుందారపు మహేశ్వర్, రమేష్ బాబు, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సఖి అడ్మినిస్ట్రేటర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లద్దు

**ప్రజాపక్షం/కుంటాల:** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై రజని కాంత్ కోరారు. బుధవారం మండలంలోని కల్లూరు గ్రామంలోని వాసవి విద్య సంస్థలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్విని యోగం,అక్రమ రవాణాకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, మారకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్ధినీ విద్యార్థులకు ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయిలు, గట్టుపల్లి శ్రీనివాస్,జానకీరాం,రాజ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




**బైంసాలో....** బైంసా పట్టణంలోని గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బైంసా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుండి కళాశాల వరకు మాదకద్రవ్యాల దుర్వినియోగం పైన అవగాహన కల్పిస్తూ ర్యాలీని నిర్వహించారు.అనంతరం కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల దుర్వినియోగంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అదేవిధంగా కళాశాలలో సాముహికంగా మాదకద్రవ్యాల దుర్వినియోగంపై ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ముష్కం రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సాయినాథ్, కళాశాల అధ్యాపకులు సుభాష్, సత్యశీల తదితరులు ఉన్నారు.

## ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు



**ప్రజాపక్షం / ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో ప్రతి సంవత్సరం ముదిరాజ్‌లు అత్యంత పవిత్రంగా ప్రతిష్టాత్మకంగా జరుపుకునే పెద్దమ్మ తల్లి బోనాలను ఈ యేడాది అంగరంగా వైభవంగా జరుపుకున్నారు. ఇంటింటికీ బోనంతో ఆటపాటలతో ఊరేగింపుగా వెళ్లి పెద్దమ్మతల్లికి సమర్పించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పెద్దమ్మ తల్లి దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని వేడుకున్నారు. చేపలు వేటకు వెళ్లిన సంధర్భంలో ఎటువంటి ఆపదలు, ఆటంకాలు ఎదురుకాకుండా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ అధ్యక్షుడు జెకె, సిరిసేడు మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు రెడ్డి సారంగం, కుల పెద్దమనిషి పుట్ట కుమారస్వామి, ఉపాధ్యక్షులు పుట్టరాజు, డైరెక్టర్లు పద్మయ్య, చంద్రమౌళి, అశోక్, చిరంజీవి, శివ, రవి, చేరాలు రాజకొమురయ్య, సాయిలు, రాయమల్ల, రెడ్డిక ఉమార్ తదితరులున్నారు.

## కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

సమస్యలు పరిష్కరించకుంటే
చలో హైదరాబాద్
అసెంబ్లీ ముట్టడి చేపడతాం
మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్
యూనియన్ సిఐటియు రాష్ట్ర ప్రధాన
కార్యదర్శి జనగాం రాజమల్లు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** అనేక సంవత్సరాలుగా గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడం కోసం ఎంతో కష్టపడి పని చేస్తూ సేవలందిస్తున్న గ్రామపంచాయతీ మున్సిపల్ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు అన్నారు. బుధవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీలు ఇచ్చిన పిలుపులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నా కార్యక్రమానికి తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాయమల్లు హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధులందరూ అధికారంలోకి వచ్చే ముందు మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచుతామని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. అధికారంలో వచ్చి ఆరు నెలలు గడిచినా కూడా ఇప్పటి వరకు ఏ ఒక్క సమస్య పరిష్కరించకపోగా వేతనాలు కూడా సరిగా ఇవ్వకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత శాఖ మంత్రులు వెంటనే గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ సదుపాయాలు కల్పించి పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని లేకుంటే రానున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ మున్సిపల్ కార్మికులందరితో చలో హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గుర్రం అశోక్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మల్యాల నర్సయ్య, కార్యదర్శి అన్నల్దాస్ గణేష్, గురజాల శ్రీధర్, మున్సిపల్, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు కాసారపు శంకర్, లింగంపల్లి కృష్ణవేణి, బుర్ర శ్రీనివాస్, సుల్తాన్ నర్సయ్య, దోబ్బల లచ్చయ్య, వర్కోలు మల్లయ్య, అంజయ్య, శ్రీనివాస్, మహేష్, పద్మ, మమత, లక్ష్మి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పధార్థాలతో జీవితం నాశనం చేసుకోవద్దు



**ప్రజాపక్షం / ఇల్లందకుంట:** ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మోడల్ స్కూల్‌లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ అవగాహన దినోత్సవం నిర్వహించారు. మత్తుపధార్థాలతో కలిగే దుష్పరిణామాలు, ప్రభావాలు, నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావాలు, సామాజికంగా ఆర్థికంగా ఎదుర్కొంటున్న సమస్యలపై పాఠశాల స్థాయిలో పిల్లలకు అవగాహన కల్పించారు. ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్.తులసీదాస్, డాక్టర్ కళ్యాణ్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువత మత్తు పధార్థాలకు బానిస కావొద్దు

చొప్పదండి సిఐ ప్రకాష్ గౌడ్



**ప్రజాపక్షం/చొప్పదండి:** విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని చొప్పదండి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ప్రకాష్ గౌడ్, చొప్పదండి ఎస్సై ఉపేంద్ర చారి కోరారు. ఈ మేరకు చొప్పదండి పట్టణ కేంద్రంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా మాదకద్రవ్యాలు వాటి ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. మండలంలో ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పధార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పట్టణంలో పబ్లిక్ ప్లేసులో, ఆటోలకు యాంటీ డ్రగ్స్ పోస్టర్లు అంటించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఢిల్లీలో ముగిసిన జగిత్యాల పంచాయతీ

ఏఐసిసి నేతలతో జరిపిన చర్చలు సఫలం..

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు హైదరాబాద్ నుండి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు ఢిల్లీకి వెళ్లారు. జగిత్యాల బిఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను జీవన్ రెడ్డికి సమాచారం ఇవ్వకుండా ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్న అంశం ఎమ్మెల్సీకి తీవ్ర ఆగ్రహం తెప్పించింది. సియం పై అసహనంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించడం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం లేపింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ అధిష్టానం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, విప్‌లు లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్‌లు జీవన్ రెడ్డిని బుజ్జగించేదుకు జరిపిన చర్చలు సఫలం కాలేకపోగా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని పెద్దాయన డిసైడ్ కావడం సంచలనం సృష్టించింది. తన ప్రత్యర్థి ఎమ్మెల్యేను పార్టీలోకి తీసుకుని తనను అగౌరపరిచారని విలువలు లేని రాజకీయాలు అవసరం లేదని పార్టీలో కొనసాగుతూనే గ్రామాల్లో పర్యటిస్తూ ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా చూస్తానని పేర్కొనడంతో కాంగ్రెస్ అధిష్టానం జీవన్ రెడ్డిని ఢిల్లీకి పిలిపించి చర్చలు జరిపింది. జాతీయ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కేసి వేణుగోపాల్, ఢిల్లీలో ఉన్న సియం రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ దీపాదాస్ మున్షీ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ లను జీవన్ రెడ్డితో పాటు పిలిపించింది. సోనియా గాంధీ ఈ విషయంలో జోక్యం చేసుకుని రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో కలిసి జీవన్ రెడ్డి విషయమై చర్చించి ఆయనకు టిపిసిసి అధ్యక్ష పదవీ కట్టబెట్టాలనే ఆలోచన చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిని టిపిసిసి అధ్యక్షునిగా నియమించి ప్రభుత్వ పరంగా ఆయన సేవలను వినియోగించుకోవాలని అధిష్టానం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అన్ని శాఖల పై పూర్తి స్థాయిలో పట్టు ఉన్న నేపథ్యం, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి విషయంలో జీవన్ రెడ్డి సూచనలు, సలహాలు ప్రభుత్వానికి చాలా అవసరమని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తుంది.



2023 అసెంబ్లీ ఎన్నికల్లో, 2024 నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో జీవన్ రెడ్డి పరాజయం చెందిన నిత్యం ప్రజా జీవితంలో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో ముందుంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టిని ఆకర్షించారు. సియం కు సన్నిహితంగా ఉండడం, ఎమ్మెల్సీగా కొనసాగుతుండడం మంత్రి పదవికి అర్హతలు ఉన్నా, ఎమ్మెల్యే, ఎంపిగా ఓడిపోవడం, రెడ్డి సామాజిక వర్గంలో కేబినెట్ బెర్తుల కోసం తీవ్ర పోటీ ఉన్న నేపథ్యం, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లు మంత్రి వర్గంలో ఉండడం జీవన్ రెడ్డికి ప్రతికూల అంశాలుగా మారాయన్న అభిప్రాయాలు పార్టీలో వ్యక్తం అవుతున్నాయి. జీవన్ రెడ్డి రాజకీయ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రోటోకాల్ పదవీ లేదా ఆయన హోదాకు తగ్గ ఉన్నత పదవీ కట్టబెట్టి ప్రభుత్వ పార్టీ అంతరంగిక విషయల్లో ఆయన సేవలను వినియోగించుకోవాలని సోనియా గాంధీ ఆలోచన చేస్తున్నట్లు, ఈవిషయంపై కాంగ్రెస్ అధిష్టానంతో చర్చలు జరిపారని, కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతుంది.

## సెస్‌ను అభివృద్ధి పథంలో నిలబెడతాం

### సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

**ప్రజాపక్షం / రాజన్నసిరిసిల్ల ప్రతినిధి:** ప్రతినిధులందరి సహకారంతో సెస్ ను అభివృద్ధి పథంలో నిలబెడతామని చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. బుధవారం పద్మనాయక కళ్యాణ మండపంలో సహకార విద్యుత్ సంస్థ సెస్ 50వ వార్షిక మహాసభ సమావేశం చిక్కాల రామారావు అధ్యక్షతన జరిగింది. వరుసగా వచ్చిన ఎలక్షన్ కోడ్ ల వల్ల కొన్ని సమస్యలను పరిష్కరించడంలో ఆలస్యం జరిగిందని అన్నారు. తమ పాలకవర్గం ఎన్నికైన తర్వాత సంస్థను అభివృద్ధి పదంలో నడిపించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. 130కోట్లు బకాయిలు ఉన్నాయని గ్రామస్థాయిలో ప్రతినిధులు, సిబ్బంది సహకారంతో బకాయిలు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. పలువురు ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు చిక్కాల రామా రావు సమాధానం చెప్పారు. ఎండి ఎల్. శ్రీనివాస్ రెడ్డి నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు లక్ష్మీ నారాయణ, రవీందర్ రెడ్డి, నారాయణరావు, సందుపట్ల అంజిరెడ్డి, వరుస కృష్ణారి, మాడుగుల మల్లేశం, శ్రీనివాస రావు, ఆకుల గంగారాం, నామాల ఉమ, ఆకుల దేవరాజం, కొట్టేపల్లి సుధా కర్, తిరుపతి రెడ్డి, సెస్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ, అంగన్వాడీ సెంటర్ తనిఖీ



**ప్రజాపక్షం / జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామపంచాయితీని, అంగన్వాడీ సెంటర్‌ను, పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ద్వారా పంపిణీ మందులు దేని కోసం ఇస్తున్నారు. ఇక్కడ ఎంత మంది పేషంట్లు ఉన్నారు. బి.పి, షుగర్ వ్యాధి ఉన్నవారికి మందులు పంపిణీ చేస్తున్నారా, వారికి సంబంధించిన టెస్టులు నిర్వహిస్తున్నారా లేదా అని పల్లె డాక్టర్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీలలో రికార్డుల నమోదు సరిగా ఉన్నాయా లేదా అని రికార్డులను పరిశీలించారు. హరితహారంలో భాగంగా నర్సరీ మొక్కలను కలెక్టర్ పరిశీలించి ఎన్ని మొక్కలు ఉన్నాయి. ఏ మొక్కలు ఎక్కువగా పంపిణీ జరుగుతుంది. ఇంట్లో పెంచుకునే మొక్కలు ఏమేమి ఉన్నాయని అడిగారు. మొక్కలను నీరు పోసి సంరక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అంగన్వాడీ సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లలకు సంబంధించిన రిజిస్టర్ నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఆరు సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలు ఎంతమంది ఉన్నారు, వారు రోజు వస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వారి అటెండెన్స్ వివరాలను కలెక్టర్ చెక్ చేశారు. రోజువారికి ఇచ్చే ఆహార మెనును వయస్సుకు తగ్గట్టుగా పొడవు, బరువు ఉన్నారా, వారికి దేని సంబంధించిన ప్రోటీన్స్ ఆహారం ఇస్తున్నారా, బరువు తక్కువగా ఉన్నవారికి బాలామృతం ఇస్తున్నారా లేదా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. లైటింగ్ కూడా సరిగా లేదని చీకటిగా ఉందని పిల్లలకు ఇబ్బంది కలుగుతుందని వెంటనే తగిన మరమ్మత్తులు చేయడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌సూచించారు. గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను కలెక్టర్ విజిట్ చేసి ఎంత మంది పేషంట్స్ ఉన్నారు. వారికి దేనికి సంబంధించిన మందులు పంపిణీ చేస్తున్నారు, సిబ్బంది ఎంత మంది ఉన్నారు. స్టాక్ అందుబాటులో ఉందా లేదా అని తెలుసుకుని రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జగిత్యాల ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, డిప్యూటీ సిఈవో రఘువరన్, ఎమ్మార్వో మహమ్మద్ ఖయ్యూం, ఎంపిడివో, ఎంపివో, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

**ప్రజాపక్షం / రామగిరి :** రామగిరి మండలం బేగంపేట గ్రామ శివారులోని కంచల చెరువు సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న గుడుంబా స్థావరాలపై రామగిరి ఎస్సై కాట్రపు సందీప్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12000 లీటర్ల బెల్లం పానకం, సామగ్రిని ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ సందీప్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా గుడుంబా తయారుచేసిన విక్రయించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, నా టుసారా కాసే వారిపై పీడియాక్ట్ అమలు చేస్తామన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ రాంబాబు, కానిస్టేబుల్స్ సదానందం, రవి లు పాల్గొన్నారు.

## ఇసుక డంపుల వేలానికి రూ.5.40 లక్షల ఆదాయం



**ప్రజాపక్షం / ధర్మపురి :** ఇసుక డంపుల వేలం పాటలకు 5,40,600 రూ.ల ఆదాయం సమకూరినట్లు తహశీల్దార్ కృష్ణ చైతన్య తెలిపారు. మండలంలోని రాయపట్నం వంతెన వద్ద నిలువ ఉంచిన 300 ట్రిప్పుల అక్రమ ఇసుక డంపులను ఇటీవల మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు స్వాధీన పర్చుకున్న విషయం తెలిసిందే. ఇట్టి డంపులను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం తహశీల్దార్ ఆధ్వర్యంలో రాయపట్నం వంతెన వద్ద బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. వేలంలో ఆరుగురు పాటాదారులు దరావత్తును చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. వారిలో అత్యధికంగా పాట పాడిన రాయపట్నంకు చెందిన బొప్పు శ్రీకాంత్ 5,40,600 రూ.లకు ఇసుక వేలం పాటను దక్కించుకున్నాడని తెలిపారు. పాటదారుడు ఇసుకను అమ్ముకొనుటకు ప్రభుత్వపరంగా అన్ని రకాల పర్మిషన్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేంద్రప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

## ఖాళీ స్థలంలో బేస్‌మెంట్‌ను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

### మున్సిపల్ ముందు సిపిఐ, బీడి కార్మికుల దర్నా.




**ప్రజాపక్షం / కోరుట్ల:** బీడి కార్మిక సంఘానికి చెందిన ఖాళీ స్థలంలో మున్సిపల్ సిబ్బందితో బేస్‌మెంట్ గోడను కూల్చిన ఆ వార్డు కౌన్సిలర్‌పై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని సిపిఐ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం రోజున సిపిఐ, బీడి కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు దర్నా చేసి, కోరుట్ల సబ్ కలెక్టర్‌కు, మున్సిపల్ కమిషనర్ తిరుపతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నేతలు మాట్లాడుతూ 1976 సంవత్సరంలో సిపిఐ నేత బీడి కార్మిక సంఘం జాతీయ నాయకుడి ఆధ్వర్యంలో సర్వే నెంబర్ 1571 కోరుట్లలో ఏడు గుంటల స్థలాన్ని పార్టీ ప్రజా కార్మిక సంఘాల అవసరాల నిమిత్తం ఖరారు చేశారు. అట్టి స్థలం ఇప్పటివరకు పార్టీ ఆధీనంలో ఉంది. అక్కడే పార్టీ జెండా గద్దె నిర్మించి మే డే కార్మిక ఉత్సవాలు కార్యక్రమాలు జరుపుతున్నామని అన్నారు. ఈ నెల 24వ తేది సోమవారం రోజున ఎలాంటి నోటీస్ ఇవ్వకుండా పార్టీ నేతలను సంప్రదించకుండా ఆ వార్డు కౌన్సిలర్ తప్పుడు సమాచారంతో మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారని అన్నారు. తప్పుడు సమాచారం ఇచ్చిన వార్డు కౌన్సిలర్‌పై, మున్సిపల్ సిబ్బందిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుని జరిగిన దానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, వెన్న విశ్వనాథం, ములుగురి హనుమంతు బీడి కార్మిక సంఘం జిల్లా నేతలు సుతారి రాములు, శ్రీగాధ వేదాస్, వెన్న మహేష్, ఉస్మాన్ బీడి కార్మికులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనకై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం / గొల్లపల్లి :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు గొల్లపల్లి ఎస్సై సతీష్ గొల్లపల్లి మండల కేంద్రంలో మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం రోజు రోజుకు పెరిగిపోతుందని దాన్ని వీలైనంత త్వరగా అరికట్టాలని, మండలంలో ఎక్కడైనా గంజాయి సేవించినా, విక్రయించినా తమకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, గంజాయి నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. గంజాయి నిర్మూలన అనేది ప్రజలందరి బాధ్యత అని దానిలోని ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని వారిచే ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి సేవించినా, కలిగి ఉన్నవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడునని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గొల్లపల్లి మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సెస్‌ను అభివృద్ధి పథంలో నిలబెడతాం

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లప్రతినిధి:** ప్రతినిధులందరి సహకారంతో సెస్ ను అభివృద్ధి పథంలో నిలబెడతామని చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. బుధవారం పద్మనాయక కళ్యాణ మండపంలో సహకార విద్యుత్ సంస్థ సెస్ 50వ వార్షిక మహాసభ సమావేశం చిక్కాల రామారావు అధ్యక్షతన జరిగింది. వరుసగా వచ్చిన ఎలక్షన్ కోడ్ ల వల్ల కొన్ని సమస్యలను పరిష్కరించడంలో ఆలస్యం జరిగిందని అన్నారు. తమ పాలకవర్గం ఎన్నికైన తర్వాత సంస్థను అభివృద్ధి పదంలో నడిపించేందుకు ప్రత్యేక




ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. 130 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని గ్రామ స్థాయిలో ప్రతినిధులు , సిబ్బంది సహకారంతో బకాయిలు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. పలువురు ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు చిక్కాల రామారావు సమాధానం చెప్పారు. ఎండి ఎల్. శ్రీనివాస్ రెడ్డి నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, రవీందర్ రెడ్డి, నారాయణరావు, సందుపట్ల అంజిరెడ్డి, వరుస కృష్ణారి, మాడుగుల మల్లేశం, శ్రీనివాస రావు, ఆకుల గంగారాం, నామాల ఉమా, ఆకుల దేవరాజం, కొట్టేపల్లి సుధాకర్, తిరుపతి రెడ్డి, సేస్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

## రజక సంఘం నూతన అధ్యక్షుడిగా తిరుపతి ఎన్నిక



**ప్రజాపక్షం/శంకరపట్నంః** మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో రజక సంఘం ఆద్వర్యంలో బుధవారం నూతన అధ్యక్షుడిగా కాల్వ తిరుపతిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కొల్లూరి చంద్రమొగిలి, ప్రధాన కార్యదర్శిగా భామండ్లపెల్లి శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంపత్,ఐలయ్య, సంపత్, రాజయ్య తదితరులున్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన




**ప్రజాపక్షం/శంకరపట్నంః** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై మోడల్ స్కూల్ విధ్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హుజురాబాద్ రూరల్ సిఐ పులి వెంకట్ హాజరై విధ్యార్థులనుద్దేశించి మాట్లాడారు. నేటి సమాజంలో యువత చెడుదారిన ప్రయాణిస్తున్నారని గుట్కా పాన్ గంజాయి వంటి మత్తు పధార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ప్రజలలో అవగాహన కల్పించేందుకు పబ్లిక్ ప్రదేశాలలో డ్రగ్స్ నిర్మూలన పోస్టర్లను అతికించాలని సూచించారు. అనంతరం వారు మాదకద్రవ్య నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చిట్టాజ్యోతి, ఉపాధ్యాయ బృందం, విధ్యార్థులు పాల్గొన్నారు.

## కూరగాయలు, గొర్రె, మేకల వారసంతలు వేలం

**ప్రజాపక్షం/చొప్పదండిః** చొప్పదండి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం 202425 ఆర్థిక సంవత్సరం జులై 2024 నుంచి మార్చి 2025 వరకు 9 మాసాలకు గాను కూరగాయల వార సంత, గొర్రె మేకల వారసంతలను మున్సిపల్ చైర్మన్ గుర్రం నీరజ అధ్యక్షతన కమిషనర్ కె.నాగరాజు సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించారు. వారసంత వేలంలో ముగ్గురు పాల్గొనగా కొత్తూరు శ్రీనివాస్ రూ.లక్ష 75వేలకు అధిక వేలం పాట పాడి వేలం హక్కును పొందారు. గొర్రె, మేకల వారసంత వేలంలో నలుగురు పాల్గొనగా కొత్తూరు మహేష్ ఏడు లక్షల 26 వేలకు వేలం దక్కిందచుకున్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ డి.ప్రశాంత్ కుమార్, కార్యాలయ సిబ్బంది, వేలం పాటదారులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేక మాట్లాడుతున్న: పుట్ట మధు

**ప్రజా పక్షం/ముత్తారం :** మాజీ మంత్రి శ్రీధర్ బాబు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే పుట్ట మధు అసత్యపు మాటలు మాట్లాడుతున్నాడని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ అన్నారు.బుధవారంముత్తారం మండల కేంద్రంలోని కాసర్ల గడ్డలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ నిన్నటి రోజున తెలంగాణా భవన్ లో ప్రెస్ మీట్ మతిభ్రమించి మాట్లాడినటువంటి పుట్ట మధు వ్యవహార శైలి మార్చుకోవాలని హెచ్చరించారు.శ్రీపద రావు ఎమ్మెల్యే ఉన్నప్పుడు వారి ఇంట్లో ఉంటూ కమిషన్లకు కక్కుర్తి పడింది నువ్వు కాదా మంథనిలో జరుగుతున్నటువంటి అభివృద్ధిని చూసి నీకు నిద్ర పట్టక మచ్చలేని మా నాయకులపై ప్రభుత్వంపై లేనిపోని అవాకులు చివాకులు పేలుస్తూ మరోసారి ప్రజల ముందు ఆబాసుపాలయ్యారని కక్ష రాజకీయాలు తావులేకుండా



మంథని ప్రాంతాన్ని అభివృద్ధి తీసుకెళ్తున్నటువంటి దుదిల్ల కుటుంబం పై విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సి సెల్ ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య,మండల మైనార్టీ అధ్యక్షుడు వాజిద్ పాషా, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు గాదం శ్రీనివాస్ , ముత్తారం గ్రామ శాఖఅధ్యక్షుడు అనుము సమ్మయ్య, ఓడేడ్ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి చంద్రమౌళి గౌడ్ ,అనుము రామస్వామి, చొప్పరి సంపత్, వెల్మరెడ్డి శ్రీనివాస్,బాలసాని రాజ్ కుమార్,బండ రాజిరెడ్డి, లాక్కం రాజు తో పాటు సీనియర్ మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన ర్యాలీ

**ప్రజాపక్షం/ముత్తారం:** మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై ముత్తారం ఎస్సై మధుసూదన్ రావు ఆధ్వర్యంలో బుధవారం ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి అడవి శ్రీరాంపూర్ చౌరస్తా రహదారి మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రామగుండం కమిషనరేట్ సి పి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ అవగాహన ర్యాలీలో జూనియర్ కళాశాల అధ్యాపకులతో పాటు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం కరోనా వైరస్ కంటే అత్యంత భయంకరమైనదని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిశితంగా పరిశీలిస్తుండాలని కోరారు. మాదక ద్రవ్యాల అమ్మ కాలు, వినియోగం




వంటివి గుర్తిస్తే100 తోపాటు టోల్ ఫ్రీ నెంబర్ కి సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ వినియోగంపై యువతను చైతన్యవంతం చేయాలని విద్యార్థులకు సూచించారు. అలాగే యువతలో మార్పు తీసుకురావడం ద్వారానే డ్రగ్స్ వాడకాన్ని అరికట్టడం సాధ్యమ వెలుతుందని ఎస్సై మధుసూదన్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం తో పాటు అధిక సంఖ్యలో విద్యార్థులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై త్వరలో ఉత్తరాలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి కి ఉత్తరాల పంపిణీ కార్యక్రమం చేపడతామని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. బుధవారం ఇసిఐఎల్ కాప్రా,హైదరాబాద్ వద్ద గల వరుణ్ ఎన్ క్లేవ్ లో సింగరేణి రిటైర్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం అసోసియేషన్ అధ్యక్షులు దండంరాజ్ రాం చందర్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి బుపెల్లి బానయ్య,ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి సింగరేణి యాజమాన్యంకు, కార్మిక సంఘ నాయకులకు తమ సమస్యల పరిష్కారానికి పలు సార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికి ఎటు వంటి ఫలితం దక్కడం లేదని వారు ఆవేదన వ్యక్తపరిచారు. అందుకే సింగరేణి విశ్రాంత ఉద్యోగులను సీనియర్ సిటిజన్లుగా గుర్తించి వారికి తగిన సౌకర్యాలు కల్పించాలని, వారికి తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలని,వృధ్యాప్య ఆసరా పెన్షన్ వర్తింప జేయాలని, చాలి చాలని అతి తక్కువ కోల్ మైన్స్ పెన్షన్ తో బ్రతకడం కష్టంగా ఉండటం వలన రిటైర్ కార్మికులకు ఆదుకోవాలని రాష్ట్ర ముఖ్య మంత్రి గారికి త్వరలో ఉత్తరాలు వ్రాసి ఉద్యమం చేబడుతామని, సింగరేణి అధికారులు, కోల్ మైన్స్ పెన్షన్ ఫండ్ అధికారులు విశ్రాంత ఉద్యోగులకు త్వరితగతిన రివైజెడ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్లను వారి ఇంటి చిరునామాకుపంపే ఏర్పాట్లు చేసేందుకు చొరవ చూపాలని సభ్యుల అంగీకారంతో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు దండంరాజు రామచందర్ రావు, ప్రధాన కార్యదర్శి బుపెల్లి బానయ్య,ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, నాయకులు సామంతుల నర్సింగ్ రావు, టి.ఉమాకర్, ఎం.విజయ బాబు, మతంగి లింగయ్యవి.పార్థ సారథి, బి.రామచంద్ర రెడ్డి,ఎస్ ఎస్.వి.ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం



**ప్రజాపక్షం/ముత్తారం:** గత రెండు మూడు రోజుల నుండి వర్షాలు కురవడంతో ముత్తారం మండలంలోని ఓడేడు, ముత్తారం, అడవి శ్రీరాంపూర్, లక్కారం,ఖమ్మం పల్లి గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లోని రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కొంతకాలంగా రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులు ప్రారంభించి, పత్తి విత్తనాలు నాటుతున్నారు. ముందుగానే భూములను ట్రాక్టర్లతో దున్నుకొని సాగుకు సిద్ధం చేసుకున్న రైతులు వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వరి పంటలకు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటిరవకు సుమారుగా 20% మంది రైతులు విత్తనాలు నాటినట్లు తెలుస్తోంది.

## బేగంపేటలో గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు




**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలం బేగంపేట గ్రామ శివారులోని కంచల చెరువు సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న గుడుంబా స్థావరాలపై రామగిరి ఎస్సై కాత్రపు సందీప్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12000 లీటర్ల బెల్లం పానకం, సామగ్రిని ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా ఎస్ ఐ సందీప్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా గుడుంబా తయారుచేసిన విక్రయించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, నాటుసారా కాసే వారిపై పీడియాక్ట్ అమలు చేస్తామన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ రాంబాబు, కానిస్టేబుల్స్ సదానందం, రవి లు పాల్గొన్నారు.

## ఏ.ఎల్.పి గనిని సందర్శించిన సేఫ్టీ జీ.ఎం: కె.గురవయ్య



**ప్రజాపక్షం/రామగిరి :** సింగరేణి సేఫ్టీ జనరల్ మేనేజర్ కార్పొరేట్ కె. గురవయ్య బుధవారము ఏ.ఎల్.పీ గనిని 2nd షిఫ్టో అకాస్మిక తనికి చేశారు. ముందుగా వారు ఏ.పి.ఏ జీ.ఎం కె.వెంకటేశ్వర్లు, ఆర్.జి. రీజియన్ సేఫ్టీ జి.ఎం కె.హెచ్.ఎన్.గుప్తా లతో పాటు సంబధిత అధికారులలో జరిగిన సమావేశం లో లాంగ్ వాల్, బోల్టర్ మైనింగ్ పని తీరుపై చర్చించారు. ఆనంతరం 3 సిమ్ పంచ్ ఎంట్రీ పనులను మరియూ లాంగ్‌వాల్ యొక్క పురోగతిని పరిశీలించి భద్రత పరంగా తీసుకోవాల్సిన చర్యలపై పలు సలహాలు,సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా ప్రాజెక్ట్ అధికారి కె.నాగేశ్వర రావు, ఏరియా భద్రత అధికారి సి.హెచ్. వెంకట రమణ,ప్రాజెక్ట్ ఇంజినీర్ టి. రఘు రాం,ఎస్ ఓ ఎం కె. జనార్ధన్ లతో పాటు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బొడ్రాయి ప్రతిష్టించేందుకు ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/శంకరపట్నంః**మండల పరిధిలోని ముత్తారం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ట చేసేందుకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన బొడ్రాయిని ప్రతిష్టించేందుకు గ్రామ ప్రజల ఆద్వర్యంలో బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించగా గ్రామంలోని మహిళలు నీటితో బొడ్రాయికి అభిషేకం చేసి పసుపు కుంకుమలతో మంగళహారతులతో పూజలు చేశారు. గ్రామస్తులు బంధుమిత్రులతో కోలాహలంగా జరుపుకున్నారు.